www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 26 | జనవరి | 2025
పేజీలు 8

## మావోయిస్టు నేత బడే చొక్కారావు సేఫ్

### - లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ



**ప్రజాపక్షం/భద్రాచలం :** సిపిఐ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ సేఫ్‌గానే ఉన్నారు. దీనిని నిర్ధారిస్తూ ఆ పార్టీ దక్షిణ సబ్ జోనల్ బ్యూరో ప్రతినిధి సమత పేరుతో హిందీ భాషలో లేఖను శనివారం విడుద చేశారు. పూజాకాంకేరీ అడవుల్లో ఇటీవల జరిగిన ఎదురుకాల్పుల్లో దామోదర్ మృతి చెందలేదని, క్షేమంగానే ఉన్నారని, ఆయన మరణించినట్లు ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించేందుకు తమ పార్టీ పేరును పోలీసులు వాడుకున్నారని సమత ఆరోపించారు.

# రాజ్యాంగానికి తూట్లు

### నేడు 76వ గణతంత్ర దినోత్సవం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా చెప్పుకునే భారత రాజ్యాంగం ఇప్పుడు ప్రమాదంలో పడింది. రాజ్యాంగంలో పేర్కొన్న అనేక అంశాలు ఇప్పుడు పాలక వర్గాలకు తప్పులుగా కనపడుతున్నాయి. అత్యున్నత న్యాయ స్థానం జోక్యం చేసుకుంటే తప్ప రాజ్యాంగం పరిరక్షించబడే పరిస్థితి లేదు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిన తర్వాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ జాతికి అందించిన రాజ్యాంగాన్ని సవరించాలని ఛాన్స్ దొరికితే మొత్తం మార్చివేయాలని ప్రస్తుత బిజెపి చూస్తుంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగంలో పేర్కొన్న లౌకికవాదం మనుగడ ప్రశ్నార్థకమైంది. పాలక వర్గం ఒక మతాన్ని భుజాన వేసుకుని అన్యా మతానికి రక్షణ లేకుండా చేసే పరిస్థితిలో ఇక లౌకిక వాద పరిరక్షణ పరిహాసం అవుతుంది. రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలును ప్రస్తుత కేంద్ర సర్కార్ గాలికి వదిలింది. అన్నింటికి మించి రాజ్యాంగంలో పొందుపర్చిన రిజర్వేషన్లు కూడా ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నాయి. ఒక పక్క మతం, మరొపక్క హక్కుల హననం భారతదేశ ప్రజలను ఇబ్బందికర పరిస్థితులకు నెట్టివేస్తుంది. దేశశ్రేయస్సు, ప్రజల సంక్షేమం దృష్టిలో

మిగతా 2లో..

## పథకాలు సరే..

# ఎంపికే గందరగోళం



(ఫైల్)

**-పథకాల ఎంపికపై ప్రజల్లో ఆవేదన**
**-అమలుకు**
**మరికొంత సమయం అంటున్న ప్రభుత్వం**
**-రైతు భరోసా మినహా**
**మిగిలిన పథకాలపై రాని స్పష్టత**

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నాలుగు పథకాలను నేటి నుంచి ప్రారంభించనుంది. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు ఈ నాలుగు పథకాలు ప్రభుత్వం పట్ల ప్రజలకు మరింత విశ్వసనీయత

మిగతా 2లో..

## రైతులను ముంచడానికేనా ప్రూనింగ్..?



**-ప్రూనింగ్ మాటున ఏం జరుగుతుంది..?**
**-మంత్రి ఆదేశాలంటే లెక్క లేదా...?**
**-ఖల్లింగ్ చెయ్యకుండా ప్రూనింగ్ చేస్తున్నారా...?**
**-ఆఫ్ టైప్ మొక్కలను**
**ప్రూనింగ్‌తో సిద్ధం చేస్తున్నారా..?**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గత వారం రోజులుగా మండల పరిధిలోని రేగళ్లపాడు ఆయిల్ ఫామ్ నర్సరీ పై వరుస కథనాలు వస్తున్న అధికారుల తీరులో మార్పు రాలేదంటూ మండిపడుతున్నారు రైతులు. శనివారం సుమారు 50 మంది కూలీలను ఉపయోగించి ఆఫ్ టైప్ మొక్కలకే ప్రూనింగ్ చేసి రైతులను నిండా ముంచడానికి సిద్ధం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రైతులు, రైతు సంఘం నాయకులు. అనుభవం లేని నర్సరీ ఇంచార్జ్, అవగాహన లేని సూపర్ వైజర్లు అధికారులు చెప్పిన మాదిరి చేసుకుంటూ పోతున్నారని, ప్రైవేట్ వ్యక్తులు తప్ప అధికారులు ఉండారా అని ప్రశ్నిస్తున్నారు. కోస్టారికా నుండి తెచ్చిన నాలుగు లక్షల సీడ్లింగ్స్ సాగుకు పనికి రావని తేలడంతో, అధికారుల నోట్లో వెలక్కాయ పడ్డట్లయింది. ఈ విషయం ఆ నోటా, ఈ నోటా పాకి పత్రికలకు ఎక్కి, నానా రచ్చ జరగడంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాలుగు లక్షల సీడ్లింగ్స్ ను కల్లింగ్ చేయాలని, నష్టపరిహారాన్ని కంపెనీ నుండి వసూలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అయితే వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశాలను సైతం

మిగతా 2లో..

## కీకరణ్యంలో

# చదువులమ్మ ఒడి..!



**-సర్కార్ పాఠశాలలోనే పల్లె ప్రకృతివనం**
**-విపరీతమైన కోతులబెడదతో**
**విద్యార్థుల బెంబేలు**

**ప్రజాపక్షం/కొణిజర్ల :** అది ప్రభుత్వ పాఠశాల కాని విద్యార్థులు అక్కడ చదువుకోవాలంటే బెంబేలెత్తుతున్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్య బోధించక బెంబేలెతుతున్నరా అంటే అది కాదు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేయడంతో ప్రభుత్వ ఆదేశాలతో ప్రభుత్వం స్థలం ఉన్నచోట ఊరికి సమీంలో స్థలాన్ని ఎంపికచేసి పల్లె ప్రకృతివనాన్ని ఏర్పాటు చేశారు. పల్లె ప్రకృతి ఉద్దేశ్యం మంచి పూలమొక్కలు,

మిగతా 2లో..

# పథకాలు సరే..ఎంపికే గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)

పెంచనున్నాయి. ఇప్పటికే ఉచిత బస్సు, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ పథకాలను కొనసాగిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు అదనంగా ఈ నాలుగు పథకాలను ప్రారంభించ నుంది. రుణమాఫీ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగానే ప్రారంభించినప్పటికీ వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వానికి ఆశించిన మద్దతు ప్రజల నుంచి లభించలేదు. గత ప్రభుత్వం కంటే లక్ష రూపాయలు అదనంగా మాఫీ చేసినప్పటికీ రైతుల్లో ప్రస్తుత ప్రభుత్వం చేసిన రుణమాఫీ పట్ల వ్యతిరేఖత వ్యక్తమైంది. రైతు భరోసాకు సంబంధించి ఎటువంటి నిబంధనలు విధించక పోవడం, సాగులో ఉన్న భూమి మొత్తానికి రైతు భరోసాను వర్తింపజేయడం పట్ల రైతుల్లో కొంత సానుకూలత వ్యక్తమవుతుంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి ప్రామాణికంగా 20 రోజుల పని దినాలు జాతీయ ఉపాధి హామీ పథకంలో నమోదు కావాలన్న నిబంధన పేదల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన వారే పేదలు అంటే ఎలా అన్న ప్రశ్నకు ప్రభుత్వం వద్ద సమాధానం దొరకని పరిస్థితి. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా లేదని లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి తీసుకున్న నిబంధనలు సరిగ్గా లేవని ప్రజలు భావిస్తున్నారు. అందుకే గ్రామసభల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ పథకాలకు సంబంధించి పెద్ద ఎత్తున సానుకూలత రావాల్సి ఉండగా ఇందుకు తద్విరుద్ధంగా జరగడం గమనార్హం. ఈ పథకాల ఎంపికకు మరి కొంత సమయం తీసుకుంటామని ప్రభుత్వ పెద్దలు చెబుతుండడం కూడా కాస్త ఇబ్బందికరంగానే మారింది. అందుకే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ పథకాల పట్ల ప్రజల్లో అంతగా ఉత్సుకత లేదు. దీనిపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రాజ్యాంగానికి తూట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఉంచుకుని రాజ్యాంగం ద్వారా పొందుపర్చిన చట్టాలను ఈ ప్రభుత్వం కాల రాస్తున్నది. ఇప్పటికే కార్మికులకు సంబంధించిన చట్టాలను సవరించింది. వ్యవసాయ రంగానికి సంబంధించి నూతన సాగు చట్టాలను తీసుకు వచ్చి వ్యవసాయ రంగాన్ని ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టివేస్తుంది. మూడు నూతన సాగు చట్టాలు వ్యవసాయ రంగానికి ప్రతిబంధకంగా మారి రైతులను భూమికి దూరం చేసే పరిస్థితి ఏర్పడింది. ఆర్థిక అంతరాలకు సంబంధించి రాజ్యాంగంలో పేద, ధనిక మధ్య తేడాలుండరాదన్న భావనకు బిజెపి తిలోదకాలు ఇచ్చింది. బిజెపి దశాబ్ద కాల పాలనలో సంపద కొందరి చేతుల్లో పోగుబడుతున్నది. అతి కొద్ది మంది ఆర్థిక ఉన్నతిని దేశ ఆర్థిక ఉన్నతిగా చూపించి మొత్తం దేశాన్ని ప్రమాదకర స్థితికి తీసుకు వస్తున్నారు. అన్నింటికి మించి ప్రశ్నించే గొంతుకకు దేశంలోనే రక్షణ లేకుండాపోతుంది. ఏదో ఒక రకంగా ప్రశ్నించే వారిని ఇబ్బందులు పెడుతున్నారు. వామపక్ష తీవ్రవాదాన్ని చూపి చట్టాలను పక్కనపెట్టి ఊచకోతకు ఈ ప్రభుత్వం తెగబడింది. బలమైన వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు యత్నిస్తుంది. ప్రైవేటు రంగం పురోగమిస్తుంటే బిజెపి పాలనలో ప్రభుత్వం రంగం తిరోగమనంలో పయనిస్తుంది. బిజెపి దుందుడుకు విధానాలు సంపన్న వర్గాలకు బాసటగా నిలవడం మత ఉన్మాదం మొత్తంగా భారతదేశ రాజ్యాంగాన్ని ప్రమాదంలో పడేలా చేసింది.

# కీకరణ్యంలో చదువులమ్మ ఒడి..!

(మొదటిపేజీ తరువాయి)

పలురకాల పండ్ల మొక్కలతో ఏర్పాటు చేస్తే గ్రామంలోని ప్రజలు ఆ పల్లె ప్రకృతివనంలో సాయంత్రం కాని, ఉదయం కాని పెద్దలు, యువకులు మార్నింగ్ వాక్ చేస్తూ సేదతీరడానికి ఆహ్లాదకరంగా ఉండేలా ఏర్పాటు చేయాలని చెప్పారు. కాని మండల పరిధిలోని తనికెళ్లలో మాత్రం పల్లె ప్రకృతివనాన్ని గ్రామం నడిబొడ్డులో ఉన్న విద్యార్థులు చవువుకుంటున్న ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేశారు. అప్పటి ఉపాధ్యాయులు పాఠశాలలో పల్లెప్రకృతివనాన్ని ఏర్పాటుచేస్తే భవిష్యత్‌లో విద్యార్థులకు ఇబ్బంది అవుతుందని ఎంతచెప్పినా కొంతమంది ప్రజాప్రతినిధులు పట్టుబట్టి మరీ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. అవికూడా బాగా ఏపుగా పెరిగే మొక్కలు అడవిలాగా దగ్గరదగ్గర నాటడంతో అవి పెరిగి పెద్దవి అయ్యాయి. ప్రస్తుతం అది కీకారణ్యంలో తయారైంది. పాఠశాలకు చెందిన మరుగుదొడ్లు కూడా చెట్లలో ఉండటంవలన విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా ఆ చెట్ల మధ్యలోకి వెళ్లాలంటే భయపడుతున్నారు. అడవిని తలపిస్తున్న పల్లెప్రకృతివనంలో వందల సంఖ్యలో కోతులు ఆవాసం ఉంటున్నాయి. అక్కడ ప్రాథమిక పాఠశాలతోపాటు చిన్నపిల్లలకోసం అంగన్ వాడీ కేంద్రాన్ని కూడా నడుపుతున్నారు. అంతా చిన్నపిల్లలే కావడంతో మధ్యాహ్నసమయం భోజన విరామసమయంలో పిల్లలు బిక్కుబిక్కుమంటూ భోజనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులు తిన్న ప్లేట్లు కడిగిన నీళ్ల పారబోయడంతో అందులో ఉన్న అన్నం మెతుకులకోసం కోతులు ఎగబడి పిల్లలమీదకు కరవడానికి వస్తున్నాయి. ఇక్కడ పాఠశాలలో చదువులు చెప్పే ఉపాధ్యాయులుకూడా పిల్లలకు చదువులుచెప్పడం ఒక ఎత్తైతే వారిని కోతుల బారినుంచి రక్షించడం మరొక సమస్యగా మారింది. కోతులకు తోడు కుక్కలు కూడా ఈ వనంలో భారీగా ఉంటున్నాయి. సర్కార్ పాఠశాలలోనే పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేయడంతో పిల్లలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. అసలు పల్లెప్రకృతివనం ఏర్పాటు చేయాలంటే జిల్లా విద్యాశాఖ, మండల విద్యాశాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. వీరు అనుమతితో ఇక్కడ పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేశారు. సొంతంగానే ఇష్టానుసారంగా ఏర్పాటు చేవారా అనేది అధికారులు తేల్చాల్సి ఉంది. అనుమతి ఉంటే చిన్న పిల్లలు చదువుకునే పాఠశాలలో ఎలా అనుమతులు ఇచ్చారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మొక్కలు నాటితే వాటిపై అధికారులు ఏరకమైన చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం ఆపాఠశాలలో విద్యార్థులకు క్రీడలు నిర్వహించాలన్నా స్థలం లేకపోవడంతో ఉపాధ్యాయులు రోడ్డుపై ఆటలాడించాలిన వస్తోందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకొని విద్యార్థులకు రక్షణ కల్పించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# రైతులను ముంచడానికేనా ప్రూనింగ్..?





(మొదటిపేజీ తరువాయి)

టీఎస్ ఆయిల్ ఫెడ్ అధికారులు బేఖాతరు చేస్తున్నారని, మంత్రి మాటంటే లెక్క లేదా అంటూ ఆయిల్ ఫెడ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రైతు సంఘం నాయకులు. రిజాయిండర్‌లో స్పష్టంగా వ్యవసాయ శాఖ మంత్రి తెలిపిన ఎందుకు అధికారులు ఆ వైపుగా చర్యలు తీసుకోవడం లేదని, మంత్రి ఆదేశాలను బేఖాతర్ చేస్తూ, రేగళ్లపాడు నర్సరీలోని మొక్కలకు ప్రూనింగ్ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. నర్సరీలో ఆఫ్ టైప్ మొక్కలపై ఓవైపు దుమారం రేగుతుంటే అధికారులు పట్టించుకోకపోగా తమ సొంత నిర్ణయాలు తీసుకోవడం ఏమిటని మండిపడుతున్నారు. ఆఫ్ టైప్ మొక్కలకి ప్రూనింగ్ చేసి తిరిగి రైతులకు అప్పగించి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారా, లేక వీటి ద్వారా కూడా కోట్లు కూడా పెట్టాలని చూస్తున్నారా అని మండిపడుతున్నా రు. రూ. 4 లక్షలు ఖర్చు చేసి ఆఫ్ టైప్ మొక్కలకు ప్రూనింగ్ చేయటం, మరల వాటికి సస్యరక్షణ చర్యలకు లక్షలు ఖర్చు చేయటం ఏమిటని రైతుల డబ్బంటే అధికారులకు అలుసా అని , రైతుల డబ్బుతో రైతులకే పంగనామం పెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరిస్తున్నారు. ప్రూనింగ్ చేసిన వాటిని తీసుకుని సాగు చేస్తే , రైతు ఏమైపోవాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రైతు సంఘం నాయకులు. తక్షణమే నర్సరీలోని నాలుగు లక్షల మొక్కలను అధికారులు, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఖల్లింగ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నర్సరీలో జరిగిన అవకతవకలపై విచారణ వేగవంతం చేసి సంబంధిత అధికారిని విధుల నుండి శాశ్వతంగా తొలగించాలని, లేనిపక్షంలో ఈ విషయంపై కలెక్టర్, వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల, రాష్ట్ర ముఖ్యమంత్రిని మరో మారు కలిసి సంబంధిత అధికారులపై ఫిర్యాదు చేస్తామన్నారు. ఇప్పటికైనా టీజీ ఆయిల్ ఫెడ్ అధికారులు పటిష్ట చర్యలు తీసుకుని కీలక పాత్ర, సూత్రదారుల పని పట్టాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

# కాసాని ఐలయ్య మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఉమ్మడి ఖమ్మం జిల్లా సిపిఎం పార్టీ సీనియర్‌నాయకులు రాష్ట్ర కమిటి సభ్యులు ప్రజాసమస్యల పోరాటయోధుడు ప్రజాఉద్యమ సారధి కాసాని ఐలయ్య లేని ప్రజాఉద్యమాలకు తీరని లోటని సిపిఎం జిల్లా నాయకులు తాళ్లపల్లి కృష్ణ అన్నారు. శనివారం ఆయన కొణిజర్లలో మాట్లాడుతు కాసాని ఐలయ్య గుండెపోటుతో మరణించడం బాధాకరమని అన్నారు. ఆయన సుజాతనగర్ సర్పంచ్‌గా పనిచేశారని ఆయన సతీమణి కూడా సుజాతనగర్ సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధిలో వారు కీలక పాత్ర పోషించి ప్రజా అభిమానాన్ని పొందిన గొప్ప నాయకుడని కొనియాడారు. పార్టీలకీతంగా ఇండ్ల స్థలాలు, రైతాంగ సమస్యల పరిష్కారం ఎంతో కృషిచేశారని అన్నారు. ఆయన మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ఆయన ఆశయసాధనకు కృషిచేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, తాతా పద్మ, అన్నారావు వెంకటేశ్వర్లు, జోనబోయిన అంజయ్య, దొడ్డపునేని కృష్ణార్జునరావు, కట్టా రాంబాబు, చింతపల్లి ప్రసాద్, హరిచంద్, పుల్లూరు వెంకటేశ్వర్లు సంతాపాన్ని తెలిపారు.

## గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకుందాం



**ప్రజాపక్షం/భద్రాచలం :** 76వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని ఐటిడిఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్ రాజ్ అన్నారు. శనివారం ఐటిడిఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులకు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణకు వచ్చే అధికారులకు, కార్యక్రమానికి వచ్చే ఆహ్వానితులకు, విద్యార్థినీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మార్చ్‌ఫాస్ట్ ప్రాక్టీస్ చేసుకున్న విద్యార్థులను పరిశీలించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలనాధికారి సున్నం రాంబాబు, ఉధ్యాన అధికారి ఉదయ్‌కుమార్, టిఏ శ్రీనివాస్, డిఆర్‌ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీ నారాయణ, డిఎస్ఓ ప్రభాకర్ రావు, ఏపిఓ పవర్ వేణు, జేడిఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సువర్చలా హనుమత్ కళ్యాణం



**ప్రజాపక్షం/వైరా:** వైరా శాస్త్రనగర్‌లోని శ్రీసత్యసాయి వేద పాఠశాల ఆవరణలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి బాబా వారి శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రెండో రోజు శతజయంతి ఉత్సవాల సందర్భంగా దేవత మూర్తుల కళ్యాణ మహోత్సవాలు సువర్చలా శ్రీహనుమత్ కళ్యాణం మహోత్సవం కార్యక్రమాన్ని వేద పండితులు సత్యసాయి సేవా భక్తులు ఘనంగా జరిపించారు. వేద ఘనపాటి మాట్లాడుతూ మనం ఏదైనా గొప్ప పనిని తలపెట్టాలన్న తలపెట్టిన పని పూర్తి చేయాలన్న ఆ ఆంజనేయుడు ఆదర్శంగా నిలుస్తాడని హనుమంతుడు అంత గప్పవాడు కావడం కారణం యన బ్రహచర్య దీక్ష అని కూడా చెబుతారని అన్నారు. సువర్చల హనుమత్ కళ్యాణం తిలకించిన భక్తులకు తలంబ్రాలను అందజేశారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు దమ్మాలపాటి సుధాకర్‌రావు, విశిష్ట ప్రముఖులను సన్మానించారు. సన్మాన గ్రహీతల్లో ఐదో వార్డు కౌన్సిలర్ సునీత, కోఆప్షన్ సభ్యురాలు నూకల అన్నపూర్ణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, చింతోజు నాగేశ్వరావు, సీత దంపతులను, చింతనిప్పు వెంకటయ్య, భద్రాద్రి బ్యాంకు చైర్మన్ విశిష్టమైన రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, జంధ్యాల గౌరీనాథ, సిహెచ్.శేష సత్యకుమార్, ఆర్‌జె.రత్నాకర్, కరెడ్ల సూర్యనారాయణ, భూక్యా వెంకన్న, శ్రీరామన అచ్యుత్, భాస్కర్‌రావు, బ్రహ్మశ్రీ చంద్రశేఖర్, సింధు, ప్రవర్ణ రంగా వాసవి, మాదినేని నాగరాణి, యన్నం మాణిక్య, రాయల అన్నపూర్ణ, రాయల రోజా తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల ద్వారా మహిళల ప్రతిభ వెలుగులోకి..



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** క్రీడల ద్వారా మహిళలో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తి వెలుగులోకి వస్తుందని కస్తూరి బా మహిళా మండలి అధ్యక్షురాలు గండికోట వెంకటలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో మహిళలకు మండలి ఆధ్వర్యంలో శనివారం వివిధ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అన్ని రంగాలలో మహిళలు రాణించాలని సూచించారు. పోటీల ద్వారా మహిళలలో స్నేహ భావం పెంపొందిస్తుందని పేర్కొన్నారు. మహిళా మండలి ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శి ఉషారాణి, కోశాధికారి పెండ్యాల శ్రీమతి, ఉపాధ్యాక్షురాలు తుపురాణి ప్రమీలా, నాగమణి, అశ్విని, దివ్య, పూర్ణిమ, పావని, పుష్పావతి, విజయలక్ష్మి, వైష్ణవి, ధనలక్ష్మి, రామరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ విస్మరిస్తే నిలదీస్తాం

**రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్**

ప్రజాపక్షం/కొణిజర్ల : ఎన్నికల ముందు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండులక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని విస్మరిస్తే రైతుల తరుపున నిలదీస్తామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ , ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో రైతుసంఘం గ్రామశాఖ మహాసభ కె పరుశురాములు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రెండులక్షలపైనున్న బకాయి రైతులు ప్రయివేటు అప్పులు తీసుకొచ్చి రెండులక్షల కంటే పైనున్న బకాయిలను చెల్లించారని ప్రభుత్వం వారికి ఇంతవరకు రెండులక్షల రుణమాఫీ చేయలేదని అన్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుచేసి అమ్మపాలెం వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని అన్నారు. 55 సంవత్సరాలు వచ్చిన రైతులందరికి రూ 5 వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటరక్షణ కోసం అన్ని గ్రామాల్లో గోదాములు ఏర్పాటు చేయాలని అన్నారు. కేంద్రప్రభుత్వ అనుసరిస్తున్న రైతువ్యతిరేక విధానాలపై ఎస్‌కెఎం పిలుపుమేరకు ఈనెల 26న ఖమ్మంలో జరిగే మోటార్ సైకిల్ ర్యాలీకి మండలంనుంచి పెద్ద ఎత్తున రైతులు పల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ



మహాసభలో సిపిఐ సీనియర్ నాయకులు వెంపటి పరుశురాములు, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి మునిగె కోటేశ్వరరావు, రైతుసంఘం నాయకులు దేరంగుల లక్ష్మయ్య, గునగంటి సరోజిని, వెంకటేశ్వర రావు, రావెళ్ల సుబ్బారావు, జడ వీరబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. రైతుసంఘం అమ్మపాలెం గ్రామశాఖ అధ్యక్షుడిగా వెంపటి నరసింహారావు, సహాయ కార్యదర్శిగా గునగంటి సరోజిని, ఉపాధ్యక్షులుగా భూక్యా రామారావు, కోశాధికారిగా భూక్యా లాలు, కార్యవర్గ సభ్యులు బాణోత్ భాష, తేజావత్ శ్రీను, జడ నాగరాజు, వచ్చాపుల్లయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి

**-జాతీయ ఓటర్ల దినోత్సవంలో అదనపు కలెక్టర్**

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎన్నికలలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. శని వారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల



దినోత్సవంలో అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ పాల్గొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్క రించుకుని భారత ఎన్నికల కమిషన్ సిఈఓ అందించిన సందేశాన్ని ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శిం చారు. ఈ సందర్భంగా అందరితో ఓటు హక్కు వినియోగం సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన దేశంలో కులం, మతం, ప్రాంతం, వర్గం, భాష, పేద రికం, ధనికులనే అంతరం లేకుండా అందరికీ సమానంగా ఓటు హక్కును కల్పించడం జరిగిం దన్నారు. ఓటు ప్రాముఖ్యతను మరింత బలోపేతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మనమంత ప్రతిసారి ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి రాజే శ్వరి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం



**-పాత కలెక్టరేట్ నుంచి బస్టాండ్ వరకు ఓటరు చైతన్య ర్యాలీ**

**-భక్తరామదాసు కళాక్షేత్రంలో జాతీయ ఓటరు దినోత్సవం**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని జిల్లా వ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల (పాత కలెక్టరేట్) నుంచి పాత బస్టాండ్ వరకు ఓటు ప్రాముఖ్యతను వివ రిస్తూ ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ ఏరియాలో మానవ హారాన్ని నిర్వహించి ఓటు హక్కు గొప్పతనాన్ని అధికారులు వివరించారు. అనంతరం శ్రీ భక్తరామదాసు కళాక్షేత్రంలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో సీనియర్ సిటిజన్లకు సన్మానం చేశారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జిల్లా అధికారులు మెమొంటో, సర్టిఫికెట్లను అందజేశారు. ఓటు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశా ఖాధికారి సోమశేఖర శర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ అధికారి సునీల్‌రెడ్డి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

## సిపి సునీల్ దత్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌ను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగే శ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు లు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాల యంలో సిపి సునీల్ దత్‌ను రాయల



నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పోట్ల నాగేశ్వరరావు తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను బహూకరించి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుచ్చకాయల వీరభద్రం, ముక్కా శేఖర్‌గౌడ్, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

## నివారణ చర్యలు చేపట్టండి

ప్రజాపక్షం/కొణిజర్ల : మొక్క జొన్న పంటను కత్తెర పురుగు ఆశి స్తుందని దీనికి నివారణ చర్యలు తీసుకోవాలని కొణిజర్ల మండల వ్యవసాయ అధికారి బాలాజీ తెలి పారు. మండల పరిధిలోని ఉప్పల చలకలో శనివారం మొక్కజొన్న



పంటను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు కత్తెరపురుగు లార్వా మొక్కజొన్న ఆకులను, కాండాన్ని తింటుందని లార్వా పెరిగే కొద్ది ఆకులను పూర్తిగా తింటుం దని అన్నారు. లద్దె పురుగులు మొక్కజొన్నను ఎక్కువగా ఆశించి తినడం వలన ఆకులు పూర్తిగా నష్టపోయి కాండంమాత్రమే మిగులుతుందని తెలిపారు. రెక్కలపురుగు రోజుకు 100 కిమీ వరకు ప్రయాణించే సామర్థ్యం కలిగిఉండి మొక్కజొన్నతోపాటు, జొన్న, పొద్దుతిరుగుడు పంటపై కూడా ప్రభావం చూపుతుందని తెలిపారు. ఎకరాకు 5 లింగాకార్షక బుట్టలు పెట్టి పురుగు ఉధృతిని తెలుసుకుని తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. లేతమొక్కజొన్నలో ఎకరానికి 10 చొప్పున టి ఆకారపు కర్రలను అమర్చుకోవాలని తెలిపారు. ఎరువులను సరైన మోతాదులు వేసుకోవాలని పేర్కొన్నారు. పురుగులు నివారణకు వేప సంబంధిత మందులు వాడాలని తెలి పారు. వీటి నివారణ చర్యలకు గాను దగ్గరలోని వ్యవసాయాధికారులను సంప్రదించి మందులు పిచికారి చేయాలని పేర్కొన్నారు.

# రెవెన్యూ మేళాలో 80 దరఖాస్తులు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ మేళాలో ఇంటిపన్ను, పంపు పన్నుకు సంబ ధించి 80 దరఖాస్తులు వచ్చినట్లు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. శనివారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో నిర్వ హించిన రెవెన్యూ మేళాను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పోరేషన్ పరిధిలో ఇంటి, పంపు పన్నులకు సంబంధించి సమస్యల పరిష్కారానికి రెవెన్యూ మేళాను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ రెవెన్యూ మేళాలో ఇంటికి సంబంధించి నెంబర్ల తప్పు, ఇంటి పన్నుల్లో తప్పులు, డబుల్ ఇంటి నెంబర్ల నమోదు, పంపు పన్నులకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఇట్టి దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. మేళాలో ఇంటి పన్నుకు సంబంధించి న్యూ అసెస్మెంట్ తొమ్మిది దరఖాస్తులు, ఇంటి యజమాని పేరు మార్పిడికి 10, మ్యూటేష న్‌కు 11, రివిజన్ పిటిషన్స్ 11, డబుల్ ఎంట్రీ తొమ్మిది, ఇంటి నెంబర్ కరెక్షన్ తొమ్మిది, లోకలిటి ఛేంజ్ మూడు, డిమాండ్ నోటీస్ జారీకి సంబంధించి ఒకటి, ఎక్స్‌టెన్షన్ సంబంధించి రెండు మొత్తం 64 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలి పారు. పంపు పన్నుకు సంబంధించి వాటర్ ట్యాప్ తొలగింపు ఐదు, మ్యూటేషన్ నాలుగు, పోస్టింగ్ ఒకటి, నూతన పంపు కనెక్షన్ రెండు, పోస్టింగ్ నాలుగు మొత్తం 16 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలి పారు. ఇంటి, పంపు పన్నులకు సంబంధించి మొత్తం 80 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. ఈ మేళాలో అసిస్టెంట్ కమిషనర్ షఫీ వుల్లా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు ఇవ్వాలి

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించా లని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శని వారం సయ్యద్ మియాజానీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు మంజూరు పేరుతో ఏర్పాటు చేసిన గ్రామసభలు లోపభూయిష్టంగా




ఉన్నాయమన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకుల పేర్లను ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసాలాంటి పథకాల జాబితాలో గ్రామసభల్లో అధికారులు చదివి విన్పించడంతో ప్రజలు ఆగ్రహం, ఆవేశాలకు గురికావాల్సి వచ్చిందని, తప్పుడు జాబితాలతో చేపట్టిన సర్వేను రద్దు చేసి అర్హులైన ప్రతిఒక్క కుటుంబానికి ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాది కాలంలో అన్ని పథకాలపై ఆర్భాటంగా ప్రచారం చేస్తుంది కాని ఏ ఒక్క పథకం కూడా పూర్తిస్థాయిలో అందలేదన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తూచా తప్ప కుండా నూరుశాతం అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఇప్ప టికైనా ప్రభుత్వం జరిగిన తప్పులను సరి చేసుకుని అర్హులందరికీ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ, ఎఐటీయూసి నాయకులు పఠాన్‌జలాల్, రహంతుల్లా, సిపిఐ సోషల్‌మీడియా ఇన్‌చార్జి నూకవరపు విజయ్‌కాంత్, జక్కం బలరాం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలి

ప్రజాపక్షం/చింతకాని : ఓటు హక్కు ప్రతి ఒక్కరూ పొందాలని చింత కాని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు తెలిపారు. జాతీయ ఎన్నికల సంఘం ఏర్పడి 70ఏళ్ళు పూర్తయిన నేపథ్యంలో తహసీల్దార్ కార్యా లయం నుంచి చింతకాని ప్రధాన సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి అధికారులు ఓటర్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ అనంతరాజు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క వ్యక్తి ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఓటర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ ర్యాలీలో నయాబ్ తహసీల్దార్ వీరభద్రునాయక్ , గిర్దావర్ రఘు, పంచాయతీ కార్యదర్శి రమేష్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి చెస్ పోటీల్లో సత్తా చాటుతున్న మాంటిస్సోరి విద్యార్థి



ప్రజాపక్షం/మణుగూరు: జాతీయ స్థాయి చెస్ పోటీలలో మణుగూరు (సత్య భాస్కర) మాంటిసోరి నాలుగవ తరగతి విద్యార్థి టివీ సాత్విక్ చెస్ పోటీలలో మాంటిసోరి పాఠశాల చెత్త చాటాడని ప్రిన్సిపాల్ ఐజాక్ థామస్ శనివారం తెలిపారు. ఏపీలోని పెద్దాపురంలో ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనవరి 17 నుంచి 21 వరకు జరిగిన అండర్ 9 క్యాటగిరిలో 13వ జాతీయ స్థాయి స్కూల్స్ చెస్ ఛాంపియన్షిప్ లో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. పూణేలో జరిగిన 37వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ లో జాతీయ స్థాయిలో 28వ స్థానం కైవసం చేసుకున్నాడని తెలిపారు. విజయవాడలో జరిగిన భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ కార్యక్రమంలో అండర్ 9 క్యాటగిరీలో 2వ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. హైదరాబాద్ ఎల్ బీ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి ఎంపిక కు జరిగిన స్టేట్ సెలక్షన్స్ లో ప్రథమ స్థానంలో ఉన్నాడని తెలిపారు. కో కరికులం మరియు పాటల పోటీలను తమ విద్యార్థులు ముందుంటారని తెలిపారు.

## ఇంటి కోసం ఫ్లకార్డుతో నిరసన



ప్రజాపక్షం/చింతకాని : నిరుపేదనైన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరిచేయాలని ఫ్లకార్డుతో ఖమ్మంబోనకల్ ప్రధాన రహదారిపై పందిళ్లపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట వ్యక్తి నిరసన తెలిపాడు. వివరాల్లో కెళితే పందిళ్లపల్లి గ్రామానికి చెందిన నల్లగొండ ఆదినారాయణ ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజాపాలనలో, సమగ్ర కులగణన సర్వే సమయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇటీవల జరిగిన గ్రామసభలో అర్హుల జాబితాలో తన పేరు లేకపోవడంతో శనివారం ఉదయం ఖమ్మం బోనకల్ ప్రధాన రహదారిపై ఇల్లు మంజూరీ చేయాలని ఫ్లకార్డు పట్టుకుని నిరసన తెలిపాడు . దీంతో ట్రాఫిక్ జామ్ అవడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఆదినారాయణను సముదాయించి దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరవుతుందని చెప్పి ఆందోళన విరమింప జేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## రేపల్లెవాడలో నాలుగు పథకాలకు శ్రీకారం

ప్రజాపక్షం/చింతకాని : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల నాలుగు పథకాలు నూరుశాతం రేపల్లె వాడ గ్రామంలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ నాయకులు ,ఖమ్మం మర్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా అందిస్తున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు సంక్షమ పథకాలు అమలు చేయడం గర్వకారణమన్నారు. సంక్షమ పథకాల అమలుకు రేపల్లెవాడ గ్రామాన్ని ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ,మండల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



ప్రజాపక్షం/తల్లాడ : స్థానిక బాల భారతి విద్యాలయంలో శనివారం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా మాక్ అసెంబ్లీని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులే ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులుగా వ్యవహరించారు. అసెంబ్లీ సమావేశాలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంలో బిల్లులు ఎలా ఆమోదం పొందుతాయో, పరిపాలన ఎలా సాగుతుందో అని, శాసనసభ సమావేశం ద్వారా నియోజకవర్గంలో సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో వాదనలు, ప్రతి వాదనలు వినిపించారు. విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ తాళ్ళూరి రామారావు, ఇన్‌చార్జి యాచమనేని శశాంక్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోసూరి వీరయ్యకు నివాళి



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలం బాలపేట గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నర్సింహారావు తండ్రి కోసూరి వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఆయన దిశదిన కర్మ కార్యక్రమం బాలపేటలోని వారి గృహంలో జరిగింది.ఈ కార్యక్రమానికి మాజీ తల్లాడ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు పాల్గొని వీరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, నాయకులు దిరిశాల దాసురావు, ఓబులు సీతారామిరెడ్డి, పైడిపల్లి రవి, కేతినేని చలపతి, గోవిందు శ్రీనివాస్‌రావు, గుడ్ల వెంకటేశ్వర్లు, బద్దం కోటిరెడ్డి, జొన్నలగడ్డ కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇకనైనా చిల్లర రాజకీయాలు మానండి

**-సంక్షేమ పథకాల అమలు ఘనత కాంగ్రెస్‌దే**
**-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : బిఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకోని ప్రజలకు ఏమి కావాలో తెలుసుకుని మేలగాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ హితవు పలికారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు లు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ ప్రజారంజక పాలనను అందిస్తుందని వారు తెలిపారు. లక్షల కోట్ల అప్పులు చేసి గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాళా పరిస్థితికి తీసుకెళ్లిందన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గాడిలో పెడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అమలుపరుస్తూ పాలన సాగిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కలిసి కట్టుగా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రాన్ని మొదటి స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తున్నారన్నారు. గ్రామసభల్లో ప్రజలను రెచ్చగొడుతూ సంక్షేమ పథకాలు వారికి అందకుండా ఉండేందుకు బిఆర్ఎస్ నేతలు గందోళగోళాలను సృష్టిస్తున్నారన్నారు. బిఆర్ఎస్‌కు ప్రజలు బుద్దిచెప్పినా వారు మారలేదన్నారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకుని ప్రజలకు ఏమి కావాలో తెలుకుని మేలగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు, సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, పాలకుర్తి నాగేశ్వరరావు, ఎండి వై పాషా, గజ్జెల్లి సూర్యనారాయణ, నరాల నరేష్, బాణాల లక్ష్మణ్, పర్వత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గంధం టవర్స్ మురికి నీరు సంగతేంటి..?

**-రోడ్ల పక్కన దుర్వాసన**
**-వ్యాపార సముదాయాల్లోకి పోతున్న మురికినీరు**
**-ప్రజలకు ఇబ్బందికరంగా మారిన గంధం టవర్ డ్రైనేజీ నీరు**





ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గంధం టవర్స్‌లోనే డ్రైనేజీ నీరు రోడ్లపైకి వచ్చి పక్కనున్న షాపులు గృహల్లోకి సైతం డ్రైనేజీ వాటర్ పోవడంతో వాటర్ నుంచి వస్తున్న దుర్వానలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ సౌకర్యం లేనప్పుడు ఆ భవనంపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారు. ప్రజలకు ఇబ్బందికరంగా మారిన గంధం టవర్స్‌పై ఏదో ఒక నిర్ణయం తీసుకొని సమస్యను పరిష్కారం చేయకపోతే చుట్టు ప్రక్కల ప్రజలు ఇప్పటికే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఎందుకంటు ఆ గంధం టవర్స్ నిర్మాణం చేపట్టే విధంగా ఉండాలి. కాని ఆ అపార్ట్‌మెంట్ పెద్ద ఎత్తున కట్టినప్పటికి వారు ఉపయోగించే వ్యర్థ నీరు డ్రైనేజీల ద్వారా పోయే మార్గాన్ని ఏర్పాటు చేయలేకపోయారు. ఇది ఎవరు తప్పుడు? అపార్ట్‌మెంట్ నిర్వాహకులదా అధికారులదా తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే అపార్ట్‌మెంట్ చాలా మంది ప్లాట్లు కొనుక్కొని అందులో ఉంటున్నారు. ప్లాట్‌లలో వాడే వాటర్ వ్యర్థ వాటర్ డ్రైనేజీ సౌకర్యం లేక పక్క ఉన్న రోడ్డు మీద ప్రవహిస్తుంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎందుకు ఆలోచించలేకపోతున్నారు. ప్లాట్లు నిర్వాహకులు అందరూ కలిడ్రైనేజీని ఎందుకు ఏర్పాటు చేసుకోలేకపోతున్నారు. ఇది మీ సమస్య మీ అపార్ట్‌మెంట్ సమస్య మీ గంధం టవర్స్ సమస్య ఇది తేల్చాల్సిన సమస్య ఇది మీ చేతుల్లోనే ఉంది. మీరే ఈనికి ఫుల్‌స్టాప్ పెట్టాలి లేనిపక్షంలో సంబంధిత అధికారులు గంధం టవర్స్‌పై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకొని డ్రైనేజీ నిర్మాణం చేపట్టే వరకు ఆ అపార్ట్‌మెంట్‌పై ఏదో ఒక రూపంలో చర్యలు చేపట్టకపోతే ప్రజలు పెద్ద ఎత్తున రోడ్డెక్కి ఆందోదళన చేయాల్సిన సందర్భాలు కూడా కనిపిస్తున్నాయి. దుర్వాసనతో ఎదురుగా ఉన్న సమీపంలో ఉన్న తహశీల్దార్ కార్యాలయం మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయం, ఏసిపి కార్యాలయం, మద్యం డిపోతోపాటు రాజేశ్వరి డెంటల్ హాస్పిల్, సాకేత్‌కృష్ణ హాస్పిటల్ ప్రాంతాల్లో రోడ్డపైకి వచ్చిన మురికినీరు నుంచి వస్తున్న వాసనకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో గంధం టవర్స్ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి



ప్రజాపక్షం/ తల్లాడ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందించేందుకు జరిగిన గ్రామసభల్లో చాలా అవకతవకలు జరిగాయని, తక్షణమే ప్రభుత్వం స్పందించి నిజమైన అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని బిజెపి మండల అధ్యక్షులు ఆపతి వెంకట రామారావు డిమాండ్ చేశారు. శనివారం పనికి ఆహార పథకంలో జరగుతున్న అవకతవకలపై తల్లాడ ఎంపిడిఓకు బిజెపి నాయకులు వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నారుగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో లబ్ధిదారుల ఎంపికలో భూమిలేని నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. గ్రామంలో సుమారు 500పైగా లబ్ధిదారులుంటే కేవలం నామమాత్రంగా కొందరికి మాత్రమే ఆత్మీయభరోసాను అందిస్తామని ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఎలాంటి కొర్రీలు లేకుండా ప్రతి భూమిలేని నిరుపేదకు ప్రభుత్వం ఇచ్చే రైతు ఇందిరమ్మ ఆత్మీయ భరసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్నారుగూడెంలో నూతన జాబ్‌కార్డులు ఇవ్వాలని, ఇంకుడు గుంటల విషయంలో ప్రజలను చైతన్యవంతులను చేయాలని, పనికి ఆహారం పథకం పనుల్లో ఎటువంటి అవకతవకలు లేకుండా జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాదె కృష్ణారావు, చల్లా నరేష్, కొమ్మినేని రామారావు, కర్నాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ప్రజాపక్షం/ తల్లాడ : 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారుగూడెం సెక్రటరీ వెంకటేశ్వర్లు సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం తల్లాడ మండలంలోని అన్నారుగూడెం హైస్కూల్ విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం గిరిజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టియూసి విజయం తథ్యం

**-సంక్షేమం, వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడమే లక్ష్యంగా అడుగులు**
**-ఎంఎల్‌ఏ పాయం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొదెం**





ప్రజాపక్షం/బూర్గంపాడు: ప్రముఖ పరిశ్రమ పేపర్ కర్మాగారంలో ఈనెల 31న జరుగుతున్నటువంటి ట్రేడ్ యూనియన్ ఎన్నికలలో ఐఎన్‌టియుసి మిత్రపక్షాల యూనియన్ గెలుపు తథ్యమని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్యలు అన్నారు. మండల పరిధిలోని సారపాక పట్టణంలో ఐఎన్‌టియుసి ఎన్నికల కార్యాలయ ప్రారంభానికి ముఖ్యఅతిథులుగా వారు పాల్గొని కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్నటువంటి కేటీపీఎస్, పేపర్ కార్మాగారం, సింగరేణి, భారజల కేంద్రం, బిటిపిఎస్‌లు పలు పరిశ్రమలలో పని చేస్తున్నటువంటి కార్మికులకు వైద్యం కోసం ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుకు త్వరలో పునాదులు వేసి నిర్మాణం పూర్తి చేసి వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడటం జరిగిందన్నారు. గత సంవత్సరం నుండి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరవేసిందని, ఇటీవల జరిగిన సింగరేణి ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి అనుసంధానంగా ఉన్న ఐఎన్‌టియుసి యూనియన్ సంబంధించిన నాయకులు గెలవడం జరిగిందన్నారు. అదే ఉత్సాహంతో ఐటిసిలోని ట్రేడ్ యూనియన్ ఎన్నికలలో కూడా ఐఎన్‌టియూసి యూనియన్‌ను గెలిపించాలని కోరారు. ఐటిసిలో ఏడు మెరుగైన వేతన ఒప్పందాలు అమలు చేసిన ఘనత ఐఎన్‌టియూసికి ఉందన్నారు. అదే విధంగా 14వ వేతన ఒప్పందం కూడా ఐఎన్‌టియూసి గెలుపుతో సాధ్యమవుతుందని, ప్రతి కార్మికుడు గడిచే ఈ ఐదు రోజులు శక్తి వంచన లేకుండా పని చేయాలన్నారు. ఐఎన్‌టియూసి గుర్తు త్రాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంల ఐఎన్‌టియూసి రాష్ట్ర నాయకులు గోనె దారుగ, రాష్ట్ర నాయకులు త్యాగరాజు, జిల్లా ఐఎన్‌టియూసి అధ్యక్షులు జలీల్ ఖాన్, ఐఎన్‌టియూసి అధ్యక్షులు గోనె రామారావు, ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి, పినపాక బి బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బర్ల నాగమణి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఖాన్, జిల్లా నాయకులు భజన సతీష్‌కుమార్, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బదాం రమేష్‌రెడ్డి, మాజీ ఎంపిపి కైపు రోశిరెడ్డి, మాజీ సొసైటీ ఛైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు కైపు లక్ష్మీ నారాయణరెడ్డి, మంద నాగరాజు, చెన్నం ప్రసాద్, ఇగుంవ రమేష్, సోహెల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# సిహెచ్‌సి, పిహెచ్‌సిలో కేంద్ర బృందం తనీఖీలు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని తమిళ నాడు కు చెందిన పాపులేషన్ రీసెర్చ్ కేంద్రం బృందం శనివారం మండలంలోని బోదులబండ, నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను తనీఖీలు చేశారు. తొలుత మండల కేంద్రం లోని సీహెచ్సీ లో ఆకస్మికంగా తనీఖీలు చేపట్టారు. రోగులకు అందుతున్న సేవల గురించి వార్డులలో రోగులను కలిసి సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ల్యాబ్, ఆపరేషన్ వార్డులు, కాన్పుల గదులు, రోగుల పరీక్ష గదులను పరిశీలించారు. హాస్పిటల్ కు వచ్చిన రోగులను కలిసి అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం ప్రతినిధి మురుగేషన్ మాట్లాడారు. జిల్లాలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, సీహెచ్సీ సెంటర్ల ను ఐదు రోజుల పాటు తనీఖీలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, కేంద్ర పథకాల పని తీరు గురించి నివేదిక ను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ ఆఫీసర్ చందన్కుమార్, జిల్లా నోడల్ అధికారి దుర్గ, జిల్లా కమ్యూనిటీ అధికారి రఘురాం, వైద్యాధికారులు డాక్టర్ మంగళ, శ్రీకాంత్, నాగమణి, అర్జున్, సీనియర్ నర్సింగ్ అధికారులు, నర్సింగ్ అధికారులు, ఫార్మసిస్ట్, లాబ్ టెక్నిషియన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ పేదలకు వరం : దయాకర్ రెడ్డి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) నిరుపేదలకు వరంలాంటిదని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. మండలం కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయం లో మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్ ఆదుకుంటుందని అన్నారు. గత ప్రభుత్వం లో దరఖాస్తు చేసుకున్న చాలా రోజుల వరకు అందేవి కావని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలలోపే అందించే ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తో సీయంఆర్ఎఫ్ బాధితులకు సకాలంలో చేరుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు, మామిడి వెంకన్న, బొడ్డు బొందయం, వంగవీటి నాగేశ్వర రావు, రాయపూడి నవీన్, జెర్రిపోతుల అంజనీ, బచ్చలికూర నాగరాజు, బోయిన వేణు, ఈవూరీ శ్రీనివాస్ రెడ్డి, మైశా శంకర్, కుక్కల హనుమంతరావు, మేకల వేంకటేశ్వర్లు,కడియల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఓటర్ల దినోత్సవం ర్యాలీ



ప్రజాపక్షం/నేలకొండపల్లి : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పొట్టి శ్రీరాముల సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ జె.మానిష్ రావ్ మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు పొందాలని సూచించారు. ఓటు కలిగిన ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కు ను వినియోగించుకోవాలని అన్నారు. ఓటు ను అమ్ముకోవద్దని, ఓటు విషయంలో నైతిక విలువలు కలిగి ఉండాలనీ సూచించారు. ఓటు యెక్క విలువ తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్లు ఆలస్యం మధుసూధన్ రావు, బీ.రవి, ఎన్నికల విభాగం జూనియర్ సహాయకులు జె.ఎస్.సింగ్, వివిధ శాఖల అధికారులు, కళాకారులు, విద్యార్థులు. పాల్గొన్నారు.

## వికలాంగుల చేయూత పథకం ద్వారా రూ.50వేల చెక్కు అందజేత



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా రాయపాడుకు చెందిన తుమ్మ లక్ష్మి కు వికలాంగుల చేయూత పథకం ద్వారా రూ 50వేల చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరు అధైర్య పడకూడదని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆళ్లపల్లి మండల కో ప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



ప్రజాపక్షం/బూర్గంపాడు:18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్ఐ నరసింహారావు అన్నారు. శనివారం సోంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నందు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు కొరకు మండల రెవెన్యూ కార్యాలయం, బిఎల్‌ఓలకు దరఖాస్తులను అందించాలని, అదే విధంగా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుములకు అందించి, ప్రశంస పత్రాలను, స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవింద్, ఉపాధ్యాయులు శారద, లక్ష్మి , దేవి, గ్రామ పంచాయితీ కార్యదర్శి వెంకటేష్, అంగన్వాడీ టీచర్ దేవామణి, గ్రామసులు బొరెం సంపత్‌కుమార్, పెంకే నాగేంద్రబాబు, నస్కూరి క్రాంతికుమార్, పండగ రాములు, పండగ ఉదయ్‌కిరణ్, పెంకే దారుగా, ఆశా వర్కర్ పండగ చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక సంబంధాల ఉత్తమ అధికారిగా సెలగల రమేష్‌కు అవార్డు



ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి వ్యాప్తంగా బెస్ట్ అవార్డు పొందిన అధికారులలో మణుగూరు కు చెందిన డీజీఎం పర్సనల్ సెలగల రమేష్ ఒకరు కావడం మణుగూరు సింగరేణి ప్రాంతానికే గర్వకారణం. నేడు గణతంత్ర దినోత్సవ సందర్భంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో అవార్డు పొందుతున్న శుభ సందర్భంలో వారికి శుభాకాంక్షలు. మణుగూరు పారిశ్రామిక సంబంధాలలో డీజీఎం పర్సనల్ అధికారిగా సెలగల రమేష్ అద్వితీయమైన పాత్ర పోషిస్తూ యజమాన్యానికి కార్మికుల పారిశ్రామిక సంబంధాలలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకున్న అధికారిగా అందరి మన్ననలు పొందిన రమేష్ సింగరేణి వ్యాప్త బెస్ట్ అధికారులలో ఒకరిగా నిలవడం సింగరేణి మణుగూరు ప్రాంతానికి గర్వకారణం. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ సింగరేణి యజమాన్యం ప్రకటించబోయే ఉత్తమ బెస్ట్ అవార్డుకు సెలగల రమేష్ ఎంపిక రావడం మణుగూరు సింగరేణి ఉద్యోగుల ప్రాంతానికి గొప్ప శుభ పరిణామం. నేడు కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సింగరేణి మేనేజింగ్ డైరెక్టర్ చైర్మన్ బలరాం చేతుల మీదుగా పారిశ్రా మిక సంబంధాల ఉత్తమ అధికారిగా అవార్డు పొందడం మణుగూరు కే గర్వకారణం.

## సీపీఐ సీనియర్ నాయకులు కర్నె సోమయ్య మృతి పట్ల సంతాపం



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలం పగిడేరు గ్రామానికి చెందిన సిపిఐ సీనీయర్ నాయకులు కర్నె సోమయ్య మృతిచెందారు. విషయం తెలియగానే సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మాజీ ఎంపీటీసీ వేల్పుల వీరయ్య, కర్నె రామారావు, లింగాల కలమ్మ లు తదితరులు పాల్గొని సోమయ్య పార్థీవదేహంపై ఎర్ర జెండాకప్పి, పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సోమయ్య అమర హై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బి అయోధ్య మాట్లాడుతూ సోమయ్య సిపిఐ పార్టీ లో చురుకైన పాత్రను పోషించారని, పార్టీ కార్యక్రమం లో ముందుండే వారని, ఆయన మరణం దురదుష్టకరం అని, వారు ఎక్కడున్నా వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు. వీరి వెంట ఏల్క రాఘవులు, శ్రీనివాస్, సుధాకర్ లు పాల్గొన్నారు.

# క్రీడలతో ఆరోగ్యం

-మేయర్ పునుకొల్లు నీరజ
-వైఎంసిఏ వాలీబాల్ పోటీలు ప్రారంభం





ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చునని ఖమ్మం కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసిఏ) ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా నిర్వహించిన మమత రోడ్డులోని హార్వెస్ట్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి ఇన్వి వాలీబాల్ పోటీలను శనివారం మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సేవలో వైఎంసిఏ ఎల్లప్పుడు ముందుండటం అభినందనీయమన్నారు. విద్యార్థులు యువత చదువులో పడి ఆటలు మరిచిపోతున్న తరుణంలో ఇటువంటి పోటీలను నిర్వహించడం హర్షణీయమన్నారు. ఆటలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎంసిఏ అధ్యక్షులు, కార్పొరేటర్ బిజి క్లైమెంట్, ఎన్ఆర్ఐ గేర కార్తీక్, జనరల్ సెక్రటరీ జెడ్ టి. సుధాకర్, కోశాధికారి పిఏజే శేఖర్ రాజు, ఉపాధ్యక్షులు జెపివి శేఖర్‌బాబు, సంయుక్త కార్యదర్శి ఎం. గౌతమిశిల్ప, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కె. జోర్డాన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జెపి సత్యానందం, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు చిలుక రాజశేఖర్, జోసెఫ్ రామారావు, కసపర్తి సంజీవరావు, ఏబిటియుసి కార్యదర్శి తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

## ర్యాంపులు, గద్దెలు కూల్చివేత



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రోడ్డు ఆక్రమించి నిర్మించిన ర్యాంపులు, పూల మొక్కల కోసం ఏర్పాటు చేసిన కుండీలు, గద్దెలను టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. శనివారం ఖమ్మం నగరంలోని పాండురంగాపురంలో రోడ్డుపై నిర్మించిన ర్యాంపులు, పూల మొక్కల కోసం ఏర్పాటు చేసిన కుండీలను, గద్దెలను అధికారులు తొలగించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పోరేషన్ పరిధిలోని 60 డివిజన్లలోని ప్రజలు ఇంటి ముందు రోడ్డు మీద ర్యాంపులు కానీ పూల మొక్కల కోసం కుండీలు, గద్దెలు కానీ, కూర్చోవడానికి ప్రత్యేకించి దిమ్మెలను నిర్మించవద్దని తెలిపారు. అలా నిర్మించడం వల్ల రహదారులన్నీ చిన్నగా అయి వాహనదారులకు ఇబ్బందులు కలగడంతో పాటు పూల దిమ్మెలు కట్టడం వల్ల అట్టి మట్టి కాలువలో పడి పుడుకుపోయి నీరు పోకుండా ఉంటుందన్నారు. కాలువలు శుభ్రం చేయడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గృహవాసులు ఎవరు రోడ్డు మీదకు వచ్చేలా ర్యాంపులు, దిమ్మెలు నిర్మించడం, పూల కుండీల కోసం సైడ్ కాలువ మీద ర్యాంపులు నిర్మించవద్దని సూచించారు. అలా నిర్మిస్తే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేనియెడల కార్పోరేషన్ ఆధ్వర్యంలో తొలగిస్తామని సూచించారు.

## ఉమ్మడి జిల్లా క్రీడా పోటీల్లో సాయిస్ఫూర్తి విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నికల్ విద్యార్థులు ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో విభాగం విద్యార్థులు ఈ నెల 22, 23 తేదీలలో కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఉమ్మడి జిల్లాల స్థాయి డిస్ట్రిక్ట్ లెవెల్ ఇంటర్ పాలిటెక్నికల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొని పలు విభాగాలలో విజయం సాధించారు. ఈ మీట్ లో ఉమ్మడి జిల్లాకు చెందిన 08 కళాశాలలు పాల్గొన్నాయని, ఈ మీట్ లో సాయిస్ఫూర్తి కళాశాల విద్యార్థులు విజయం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దేశిరెడ్డి రఘుపతి రెడ్డి తెలిపారు. బాలుర వాలీబాల్ పోటీల్లో వరుసగా 3సార్లు ప్రథమస్థానం సాధించి హాట్రిక్ కైవసం చేసుకున్నారని. బాలికల విభాగంలో వాలీబాల్ ప్రథమ స్థానం, బాలుర విభాగంలో వాలీబాల్ ప్రథమ స్థానం, టేబుల్ టెన్నిస్ డబుల్స్ ప్రథమ స్థానం, చెస్ ద్వితీయ స్థానం, బ్యాడ్మింటన్ సింగిల్ అండ్ డబల్ రన్నర్స్ గా నిలిచారని, బాలికల విభాగంలో వాలీబాల్ ప్రథమ స్థానం, లాంగ్ జంప్ బాలికలు ప్రథమ స్థానం, బ్యాడ్మింటన్ సింగిల్ అండ్ డబల్ రన్నర్స్, 200 మీటర్స్ ద్వితీయ స్థానం, షాట్ పుట్ ద్వితీయ స్థానం, జావలిన్ త్రో ద్వితీయ స్థానం, డిస్కస్ త్రో తృతీయ స్థానం గెలిచినట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా.పూటుకూరి శేషారత్నకుమారి, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి తదితరులు అభినందించారు.

## ఆయిల్ ఫామ్‌లో అక్రమాలపై విచారణ చేపట్టండి

ప్రజాపక్షం/సత్తుపల్లి: రేగళ్లపాడు నర్సరీలోని ఆఫ్ టైప్ ఆయిల్ ఫామ్ మొక్కల వ్యవహారంపై, ఆయిల్ ఫామ్ లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించటమే కాకుండా విధుల నుండి శాశ్వతంగా తొలగించాలని బాజాపా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బాజాపా నాయకులు విడుదల చేసిన ప్రకటన సారాంశం ఈ విధంగా ఉంది. గత వారం రోజులుగా పలు పత్రికలలో రేగళ్లపాడు నర్సరీలో ఆఫ్ టైప్ మొక్కల గురించి, అధికారుల అలసత్వం పై వరుస కథనాలు వస్తున్న నేపథ్యంలో ఆ నర్సరీ నుండి తీసుకొచ్చి వేసుకున్న రైతులలో గుబులు కలుగుతుందని బిజెపి జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు అన్నారు. ఆఫ్ టైప్ పామాయిల్ మొక్కల వ్యవహారం రైతులలో ఆందోళనను, భయాన్ని కలిగిస్తుందని, కాబట్టి గతంలో మాదిరిగా కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ వెంటనే స్పందించి ఏ రైతులైతే రేగళ్లపాడు నర్సరీ నుండి మొక్కలు తీసుకొచ్చి నాటారో వాటిని పరిశీలించాలని, ఏమైనా ఆఫ్ టైప్ మొక్కలు ఉంటే వెంటనే తొలగించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల్లో ఉన్న ఆందోళనను, భయాన్ని నివృత్తి చేయాల్సిన అవసరం రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు పై ఉందన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవుట్ సోర్సింగ్, చిన్న, చిన్న ఉద్యోగులను బాధ్యులు చేస్తూ వారిపై చర్యలు తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందని, ఈ మొత్తం వ్యవహారానికి బాధ్యులైన పెద్ద తిమింగలాలపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కూడా కొంతమంది రైతులు ఈ ఆఫ్ టైపు మొక్కల వలన చాలా నష్టపోయారని, ఇకముందు ఇటువంటి అనర్థాలు జరగకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, బాధ్యులైన అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంతకుముందు నష్టపోయిన రైతులు కోర్టులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగుతున్నా ఫలితం లేకుండా పోయిందని, ఇకముందు ఏ రైతుకు అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు మరల పునరావృతం అయితే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. దోషులను శిక్షించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మట్టా ప్రసాద్, జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్ రావు, సత్తుపల్లి మండలాధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, వేంసూరు మండల అధ్యక్షులు గొర్ల ప్రభాకర్ రెడ్డి, పెనుబల్లి మండల అధ్యక్షులు బొర్రా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొర్రా కేశవులు అన్నారు. శనివారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గా నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాలు చేరాలని, గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరి చూసుకొని పేదలకు కాకుండా అనర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తే సిపిఐ పార్టీ పేద ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. మహాలక్ష్మీ పథకాన్ని కూడా త్వరలోనే అమలు చేసి మహిళలకు 2500 రూపాయలు అందించాలని, ఇప్పటికైనా పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడేది సిపిఐ అని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు జడ శ్రీను, మండల కార్యదర్శి ఉకే నారాయణ, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం




ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్లకార్డతో ప్రదర్శన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవను పురస్కరించుకొని అన్నపురెడ్డిపల్లి మండల తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్క యువతీ యువకులు, ఓటు హక్కును పొందాలని, అదే విధంగా ప్రజాస్వామ్య భారతదేశంలో ఎన్నికల ద్వారానే ఓటు హక్కును వినియోగించుకొని, సరియైన ప్రజాప్రతినిధులను ఎన్నుకొనే అవకాశం ఓటు హక్కు ద్వారానే ఉంటుందన్నారు. అందు వలన ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలో తప్పకుండా ఓటు వేసి మీ హక్కును కాపాడుకోవాలని, ఓటు హక్కును భారంగా చూడకుండా బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో గ్రామ ప్రజలతో ర్యాలీని నిర్వహించారు. ఈకార్యక్రమంలో గిర్ధవర్ మధు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండ్ల గురించి మాట్లాడే హక్కు బిఆర్ఎస్‌కు లేదు



ప్రజాపక్షం/అశ్వాపురం: ఇండ్ల గురించి మాట్లాడే హక్కు బిఆర్ఎస్ పార్టీకి లేదని యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గొల్లపల్లి నరేష్‌కుమార్ అన్నారు. శనివారం అశ్వాపురం మండల కేంద్రంలోని ఓరుగంటి వీరయ్య భవన్ మండల పార్టీ కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గురించి 7లక్షల మంది దరఖాసులు చేసుకుంటే మీరు ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు 15వేల ఇండ్లు మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. ఎరుకలగూడెంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి కాకుండా ఉంటే గ్రామస్తులు వారి సొంత డబ్బులతోనే ఆ ఇండ్ల మరమ్మత్తు పనులను చేసుకొని అందులో ఉంటున్నారని తెలిపారు. అసలు మీ హయాంలో పినపాక నియోజకవర్గంకి ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేశారని తెలపాలని మాజీ ఎంఎల్ఏ రేగాను ప్రశ్నించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నిజమైన అర్హులను గుర్తించి పథకాలు అందిస్తుంటే ఓర్వలేక మాట్లాడే మాటలు సబబు కాదని హితవు పలికారు. ఈకార్యక్రమంలో నాయకులు దారవత్ హర్ష, ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షులు ఎస్‌కే మోసిన్, యువజన నాయకులు కోలా శశికాంత్, దారావత్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మెచ్చా



ప్రజాపక్షం/దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం దమ్మపేట మండలంలో పలు కుటుంబాలను పరామర్శించారు. ముందుగా అల్లిపల్లి గ్రామంలో విజయరామరాజు (రాంబాబు) మరియు చెన్నువారిగూడెం గ్రామంలో కట్టం ఎర్రప్ప తండ్రి కట్టం రాముడు, వారి నానమ్మ వెంకమ్మ మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట నియోజకవర్గ నాయకులు దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, అల్లిపల్లి మాజీ సర్పంచ్, రెడ్డిమళ్ళ నాగయ్య, కోర్స వెంకటేష్, శ్రీరాముల చక్రధర్ రావు, రత్నాకర్, మాటూరి రాజ్ శేఖర్, శ్రీను, బెల్లం నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం కాలమాని ఆవిష్కరణ



ప్రజాపక్షం/సత్తుపల్లి: 2025 సంవత్సరం సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం కాలమానిని జెవిఆర్ ఓసీపీ నందు ప్రాజెక్టు అధికారి ప్రహ్లాద్, ప్రాజెక్టు ఇంజనీర్ శ్రీనివాసరావు, సీనియర్ పిఓ కె దేవదాస్, సర్వే అధికారి నరేష్‌లు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ధారా భీమయ్య, పిట్ కార్యదర్శి భాస్కర్ లాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ రమేష్, మోతిలాల్, వీరభద్రు, సురేష్, వినయ్, మంగీలాల్, బాలు, రమేష్ మరియు కృష్ణ పాల్గొన్నారు.

# నూతన పథకాల ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



-ప్రతి మండలంలో ఒక గ్రామంలో ప్రారంభోత్సవం
-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
-నూతన పథకాల ప్రారంభ ఏర్పాట్లపై సమీక్షించిన సిఎస్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నాలుగు నూతన పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నూతన పథకాల ప్రారంభ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి ఖమ్మం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ గ్రామవార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించినందుకు అధికారులకు అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీ పథకాలను లాంఛనంగా ప్రతి మండలంలో ఒక గ్రామంలో ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జనవరి 26న ఎంపిక చేసిన గ్రామాల్లో మధ్యాహ్నం 1గంటకు నాలుగు పథకాలను అధికారికంగా ప్రారంభించాలన్నారు. మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగాలని, నాలుగు పథకాలకు సంబంధించి గ్రామాల్లో అర్హులైన వారందరికీ లబ్ది చేకూరేలా చూడాలన్నారు. గ్రామసభల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులు ఉంటే రేపటి జాబితాలో చేర్చాలన్నారు. పండుగ వాతావరణంలో నాలుగు పథకాలకు సంబంధించిన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలన్నారు. లబ్ధిదారుల వివరాలను గ్రామాల్లో ప్రదర్శించాలన్నారు. ఎక్కడ ఎటువంటి గందరగోళం జరగకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరుతుందనే విశ్వాసాన్ని ప్రజల్లో కల్పించాలని సిఎస్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రతి మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పథకాల అమలు తప్పనిసరిగా ప్రారంభం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ







**ప్రజాపక్షం/వైరా:** 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ దినోత్సవం సందర్భంగా స్థానిక రింగు రోడ్డు వద్ద నుండి పాత సెంటర్ మీదుగా రింగు రోడ్డ వద్ద వరకు ఓటర్లు అవగాహన చైతన్య ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో వైరా మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, తహశీల్దార్ శ్రీనివాసరావు, కమీషనర్ చింతా వేణు ర్యాలీలో పాల్గొని స్థానిక రింగు రోడ్డ వద్ద జరిగిన మానవహారంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైందని, ఓటు హక్కు అని అలాంటి ఓటు హక్కుతో మనం మన సమస్యలను పరిష్కారం కోసం ఓ నాయకుడిని ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. ఓటు విలువ తెలుసుకో పది మందికి ఓటు విలువ వివరించు అని అన్నారు. కరెన్సీ కట్ల కన్నా ఓటు హక్కు ఎంతో గొప్పదని ఆయన తెలిపారు. మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించకోవాలని ఓటు హక్కు అనేది మన యొక్క హక్కు అని అన్నారు. మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు మాట్లాడుతూ మన సమస్యల పరిష్కారం కోసం మనం ఓ మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు ఎంతో ఉపయోగపడుతుందని అలాంటి ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని, 18 సంత్సరాలు నిండిన యువతి, యువకులు తప్పకుండా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ సురేష్, ఆర్‌ఐలు శ్రీకాంత్, మెచ్చా వెంకటేశ్వరరావు, కాంగ్రేస్ పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, పలువురు ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నమూనా గృహం నిరుపయోగం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2014 సంవత్సరంలో సుమారు ఐదు లక్షలతో నిర్మించిన గృహ నిర్మాణ శాఖ కు సంబంధించిన నమూనా గృహం నిరుపయోగంగా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన మండల పరిషత్ మరియు గ్రామాలలో సంబంధించిన లబ్ధిదారుల రికార్డులు దానిలో ఉంచి అదే విధంగా నిరుపయోగంగా మార్చారు. దానిని ఎవరికి ఏ విధంగా ఉపయోగ పడకుండా అదే విధంగా ఉంచారు. నమూనా గృహమును వేరే కార్యాలయాలకు ఉపయోగించుకుంటే మంచిదని, అది ఉపయోగములో లేనందున కిటికీలు, తలుపులు గృహం పాడవుతుంది దీనిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎస్‌వి ట్రేడర్స్‌లో చోరీ

-రూ.3.20లక్షల నగదు అపహరణ





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని తల్లాడ రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఎస్‌వి ట్రేడర్స్ అండ్ ఫెర్టిలైజర్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి సుమారు 1.28 నిముషాల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడి సుమారు రూ.3.20లక్షల నగదును అపహరించుకొని పోయారు. వివరాల్లోకి వెళితే వైరాకి చెందిన కొణతాలపల్లి నగేష్ తల్లాడ రోడ్డులో ఎస్‌వి ట్రేడర్స్ ఫెర్టిలైజర్స్‌ను కొనసాగిస్తున్నాడు. రోజువారిలా శుక్రవారం రాత్రి నగేష్ షాపు బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం 8.20గంటల నిముషాలకు షాపును ఓపెన చేశాను. షాపుపై పైభాగం నుండి పగులగొట్టి షాపులోకి ప్రవేశించిన దొంగలు సిసి కెమెరాలు తీసివేసి రూ.3.20లక్షలను అపహరించుకొని పోయారని షాపు నిర్వాహకుడు నగేష్ తెలిపారు. రైతులకు ఇవ్వడం కోసం షాపులో షాపులో రూ.3.20లక్షలు ఉందానని శనివారం రైతులకు ఇద్దామని, వాటిని తీసుకుపోకుండా ఉంచడం జరిగిందని షాపుకి వచ్చి చూడడం నగదు అపహరణకు గురైందని తెలిపారు. విషయాన్ని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ సంఘటనా స్థలాన్ని వద్దకు వచ్చి పరిశీలించి ఖమ్మం నుంచి క్లూస్‌టీమ్ రప్పించారు. దొంగతనం జరిగిన విధానాన్ని మొత్తాన్ని వేలిముద్రలో తీసుకొని వెళ్లిపోయారు. ఈ ఘటనపై వైరా పోలీసులు షాపు నిర్వాహకులు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

# అనుమతిలేని డయాగ్నస్టిక్ సెంటర్‌లను సీజ్ చేసిన టాస్క్‌ఫోర్స్ సిఐ



**ప్రజాపక్షం/బోనకల్:** మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మూడు డయాగ్నస్టిక్ సెంటర్‌లను ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఏసిపి ఆదేశాల మేరకు సిఐ తిరుపతిరావు, మండల అధికారులు సంయుక్తంగా కలిసి శనివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా సిఐ తిరుపతిరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధన ప్రకారం అనుమతులు లేని మూడు ప్రవేట్ డయాగ్నస్టిక్ సెంటర్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఆసుపత్రులు, ల్యాబ్‌లు నిర్వహించాలని, లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ల్యాబ్‌లను సీజ్ చేసిన వారిలో ఆయన వెంట ఎస్‌ఐ కె మధుబాబు, మండల వైద్యాధికారి వేముల స్రవంతి, ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పి రామారావు, హెడ్‌కానిస్టేబుల్స్ ఎస్‌కె ఖాసీం సాహెబ్, కోటిరెడ్డి తదితరులున్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



**ప్రజాపక్షం/ మధిర :** 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మధిరలో శనివారం ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీనిధి కాలేజి, ట్యాంక్‌బండ్ నుండి వైఎస్‌ఆర్ సర్కిల్‌వరకు కాలేజి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో జడ్జి కార్తీక్‌రెడ్డి, తహశీల్దార్ రాంబాబు, మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, మధిర సిఐ మధు పాల్గొని మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పట్టణం, మండలంలో ప్రభుత్వ పాఠశాల్లో ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సేఫ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం : ఎంఇఓ



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఖమ్మం వారు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంఇఓ వై.ప్రభాకర్ పేర్కొన్నారు. మధిరమండలంలోని మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సుమారు రూ.60వేలు విలువ చేసే పాఠశాల సూచిక బోర్డు, సిసి కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడుతూ హైద్రాబాద్‌లో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తూనే ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం మధిర మండలంలో ప్రభుత్వ పఠశాలలకు వివిధ రకాల సౌకర్యాలను అందచేస్తున్న సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు పోతుకూచి కళ్యాణచక్రవర్తిని, పౌండేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు దాతలు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చెరుపల్లి శ్రీహరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖమ్మం యువ కళోత్సవ్ 2025లో సత్తా చాటిన టాలెంట్ స్కూల్ విద్యార్థులు




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మువ్వా పద్మావతి రంగయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో నిర్వహించిన యువ కళోత్సవ్ 2025 లో స్థానిక సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారని టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాషువా పద్య పోటీలలో ప్రథమ స్థానం షేక్ ఆస్పియా, కొట్టి మౌనిష ద్వితీయ స్థానం సాధించారు. డ్రాయింగ్ విభాగంలో కలవకుంట్ల లక్ష్మీ ప్రసన్న ప్రథమ స్థానం, కోటమార్తి సత్య హర్షిత స్థానం సాధించడం జరిగింది. ముగ్గుల పోటీలలో కోటమార్తి సత్య హర్షిత ప్రథమ స్థానం సాధించడం జరిగింది. మెహందీ పోటీలలో షేక్ సమీరా ద్వితీయ స్థానం సాధించడం జరిగింది.

# పిల్లలతో సహా తల్లి బావిలో దూకి ఆత్మహత్యాయత్నం..?

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఓ మహిళ.. తన ఇరువురు పిల్లలతో సహా బావిలో దూకిందుకు యత్నించటంతో స్థానికులు గమనించి అడ్డుకోవటంతో ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మంగాపురతండా కు చెందిన ఓ మహిళ తనతో పాటు పిల్లలతో సహా బావిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు శనివారం బావి వద్దకు వెళ్లింది. స్థానికులు గమనించి అడ్డుకున్నారు. అప్పుడే పాఠశాల కు వెళ్లి వచ్చిన ఇరువురు పిల్లలను తీసుకుని వ్యవసాయ బావి వద్దకు వచ్చింది. దూకేందుకు ప్రయత్నిస్తుండుగా, పిల్లలు భయంతో ఏడ్చారు. అదే సమయంలో మిర్చి తోటలో పనులు చేస్తున్న కూలీలు ఏడుపును గమనించి బావి వద్ద కు పరుగులు తీసి అమెను, పిల్లలను దూకకుండా అడ్డుకున్నారు. మిర్చి తోటలో పని చేసే కూలీలు గమనించకుంటే పెను ప్రమాదం జరిగేదని గ్రామసులు పేర్కొంటున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా తల్లి, చిన్నారులతో సహా బావిలో దూకేందుకు ప్రయత్నించిన ఘటన కు సంబంధించి వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

